క్లుప్తంగా

పింఛన్లపై నేడు ఎంపీ బోస్ సమీక్ష

రామచంద్రపురం రూరల్: రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాస్‌చంద్రబోస్ గురువారం ఉదయం 10 గంటలకు రామచంద్రపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని మూడు మండలాలు రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరులకు సంబంధించి పింఛన్ల పెంపు, నూతన పింఛన్ల మంజూరుపై సమీక్ష నిర్వహించనున్నట్లు రామచంద్రపురం ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు మండలాల నుంచి ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

సోమేశ్వరుని ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు


స్వామి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవస్థాన సిబ్బంది

కె.గంగవరం: కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వరస్వామి ఆలయ హుండీ బుధవారం దేవస్థాన సిబ్బంది లెక్కించారు. రామచంద్రపురం తనిఖీదారు బాలాజీ రాంప్రసాద్ సమక్షంలో గత ఏడాది ఫిబ్రవరి నుంచి నేటి వరకు స్వామివారికి వచ్చి ఆదాయాన్ని లెక్కించారు. ఈ లెక్కింపులో స్వామివారి హుండీల ద్వారా రూ.2 లక్షల 87 వేల 715 ఆదాయం సమకూరిందని తనిఖీదారు బాలాజీ రాంప్రసాద్ తెలిపారు. ఈఓ శ్రీదేవి, దేవస్థాన సిబ్బంది కామేశ్వరరావు, సత్యనారాయణ, పద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదలకు మేలు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కె.గంగవరం: పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. మండలంలో బాలాంత్రం, పాణింగపల్లి గ్రామంల్లో బుధవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. గ్రామ సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొని మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ, సర్పంచ్ చీకట్ల సునీత, వైస్ ఎంపీపీ నీతిపూడి మదుబాల, బీజేపీ నాయకులు దూడల శంకర్, సలాది శేఖర్, రాఘవేంద్ర, రామకృష్ణ, కాదా వీర వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ తరలిన నాయకులు


కాకినాడ సభకు తరలివెళుతున్న మహిళలు

కాజులూరు: పేదల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ అధికారంలోకి రావాలని వైఎస్సార్ సీపీ జిల్లా సేవాదళ్ కార్యదర్శి టేకుమూడి దుర్గారావు అన్నారు. జిల్లా కేంద్రమైన కాకినాడలో బుధవారం జరిగిన సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సభకు కాజులూరు మండల గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా గొల్లపాలెంలో దుర్గారావు మాట్లాడుతూ పాదయాత్రలో అవ్వ, తాతల కష్టాలు చూసిన జగన్ తాను అధికారంలోనికి వస్తే నెలవారీ ఫించను రూ.3వేల వరకూ పెంచామన్నారు. అన్న మాట ప్రకారం పెంచారని, ఆయన పేదలకు ఎంతో మేలు చేస్తున్నారన్నారు. పార్టీ మండల యువజన విభాగ అధ్యక్షుడు పెంకే రమణ, నాయకులు మాత మురళి, పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

నేటి నుంచి సదరం స్లాట్ కేటాయింపు

ఆలమూరు: దివ్యాంగులకు గురువారం నుంచి సదరం సర్టిఫికెట్ స్లాట్ల కేటాయింపు జరుగుతుందని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ తెలిపారు. అర్హులైన, అవసరమైన దివ్యాంగులు సమీప గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లి స్లాట్ సమయాన్ని బుక్ చేసుకోవాలన్నారు. మార్చి నెలాఖరు వరకూ ఈ స్లాట్ల కేటాయింపు జరుగుతుందన్నారు.

స్వాగతం

పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ లబ్ధిని రూ.3 వేలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెంచారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖులు స్వాగతం పలికారు.


సీఎం జగన్‌ను పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్ సీపీ రామచంద్రపురం ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్, మంత్రి చెల్లుబోయిన వేణు, ఆయన తనయుడు నరేన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి

చూపు లేకున్నా... లోకాన్ని చూస్తూ...

- బ్రెయిలీ లిపితో అక్షర స్పర్శ
- క్షేత్రస్థాయిలో ప్రయోజకులైన అంధులెందరో..
- నేడు లూయీస్ బ్రెయిలీ జయంతి


మండపేటలో అంధ విద్యార్థులకు స్పర్శ జ్ఞానంతో వైకుంఠపాళి నేర్పిస్తున్న అంధ ఉపాధ్యాయుడు

కపిలేశ్వరపురం: సర్వేంద్రియానాం నయనం ప్రధానం... ఎందుకంటే మనల్ని ముందుకు నడిపించేవి ఆ కనులే.. అవి కనిపించకుంటే బతుకు భారం.. గమ్యం అగమ్యగోచరం.. అలాంటి జీవితాల్లోనూ వెలుగులు నింపిన మహోన్నతుడు లూయీస్ బ్రెయిలీ.. అంధులకు విజ్ఞానాన్ని పంచి, చీకటి జీవితాలకు ఆధారమయ్యాడు. అంధుడైన తాను బ్రెయిలీ లిపిని కనుగొని చీకటి బతుకులకు వెలుగును తెచ్చాడు. ఈ లిపిని నేర్చుకుని క్షేత్ర స్థాయిలో ప్రయోజకులైన వారెందరో ఉన్నాయి. గురువారం బ్రెయిలీ 215వ జయంతి సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

బ్రెయిలీ లిపి నేపథ్యమిది..

ఫ్రాన్స్‌లోని పారిస్ నగరానికి సమీప గ్రామంలో తోలు వృత్తిదారు కుటుంబంలో 1809 జనవరి 4న లూయీస్ బ్రెయిలీ జన్మించారు. తోలును కుట్టే దబ్బనం కంటిలో గుచ్చుకోవడంతో ఇన్‌ఫెక్షన్ కారణంగా మూడేళ్ల వయసులోనే అతని రెండు కళ్లూ పోయాయి. అయినా చదువుకోవాలని రాయల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ బ్లైండ్ యూత్ సంస్థలో చేరాడు. ఆ సంస్థలో మాజీ సైనికాధికారి చార్లెస్ బార్బియర్ అందించిన చూపు లేనివారు చదువుకోవడానికి, రాసుకోవడానికి గడిలో ఉబ్బెత్తు అక్షరాలతో కూడిన విధానం పరిచయమైంది. ఒక్కో అక్షరం రెండంకెలకు సూచికగా ఉంటుంది. వీటిని రెండు వరుసల చుక్కలతో రాసుకోవచ్చు. వేలితో చుక్కలను తాకుతూ, వాటిని లెక్క పెట్టుకుంటూ అక్షరాలను ఊహించుకోవడం దీనిలోని ప్రధాన అంశం. చదువుకోవడమే కాకుండా వేరే కాగితంపై గుర్తులను పెట్టుకోవడానికి వీలయ్యేది. దీనిని బ్రెయిలీ మరింత సులభతరం చేసి ఉబ్బెత్తు చుక్కలతో అక్షరాల లిపిని రూపొందించాడు. 1824లో పూర్తయిన ఈ లిపిని బ్రెయిలీ లిపిగా చెప్పుకోసాగారు. ఆయన పుట్టినరోజున ప్రపంచమంతా బ్రెయిలీ డేగా జరుపుకొంటున్నారు. ప్రతి గడిలో 1–6 వరకూ నిర్ణీత సంఖ్యలో ఉబ్బెత్తు చుక్కలను ఒక క్రమంలో అమర్చుతారు. చుక్కల సంఖ్య, వాటి అమరిక ఒక్కో అక్షరానికి సంకేతం. వీటిని వేలితో తాకుతూ అక్షరాలను, పదాలను పోల్చుకోవచ్చు. తేలికగా, వేగంగా చదవొచ్చు.

విరబూసిన కాంతులు

అంధత్వాన్ని అధిగమిస్తూ ముందుకు సాగుతున్న వారికి బ్రెయిలీ లిపి ఒక పూలబాట. చిన్న వయసులోనే తమ చిన్నారులను అంధుల పాఠశాలలు, బ్రెయిలీ అధ్యయన కేంద్రాల్లో చేర్పించడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు చాలా మంది. మండపేటలో ప్రభుత్వ గుర్తింపు పొందిన స్పెషల్ ఎయిడ్ యూపీ స్కూల్ ఫర్ ది బ్లైండ్ అండ్ హాస్టల్ ద్వారా బ్రెయిలీ నేర్చుకుంటున్నారు. రాజమహేంద్రవరంలో రెండు, కాకినాడ, అమలాపురంలలో ఒక్కొక్కటి చొప్పున పాఠశాలలు నడుస్తున్నాయి. మరికొన్ని చోట్ల అనాథ ఆశ్రమాల రూపంలో అంధులకు ఆశ్రయమిస్తున్నారు.

జయించి.. ప్రగతి సాధించి


మండపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపన్యసిస్తున్న టీకేవీ శ్రీనివాసరావు

మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు అంధత్వాన్ని జయించి డాక్టరేట్ పొందారు. విజయనగరం జిల్లా చల్లపేటలో 1970లో జన్మించిన ఆయన ఆంధ్రా యూనివర్సిటీలో పీజీ, బీఈడీ, పీహెచ్‌డీ పట్టాలను పొందారు. 'నేపాల్- భారతదేశం-ఒక పరిశీలన' పేరుతో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2016లో పీహెచ్‌డీ పట్టా పొందారు. నెట్, పీహెచ్‌డీలు రెండూ పూర్తి చేసిన పరిమిత ప్రతిభావంతుల్లో శ్రీనివాసరావు ఒకరు. అంధత్వంతో రీసెర్చ్ గైడ్‌గా పనిచేస్తున్న వారిలో తెలుగు రాష్ట్రాల్లో ఏకైక వ్యక్తి ఆయనే.

అంధుల సేవలో తరిస్తూ..


రాజమహేంద్రవరంలో తెలుగుతేజం 2022 అవార్డును అందుకుంటున్న రామాయణం శ్రీనివాస్ (ఫైల్)

పుట్టుకతో అంధుడైన, అమలాపురానికి చెందిన రామాయణం శ్రీనివాస్ మనోధైర్యంతో తోటి అంధుల సేవలో తరిస్తున్నారు. 2004 అక్టోబర్ 16న అమలాపురం శ్రీరాంనగర్‌లో లూయిస్ అంధుల రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించి దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. దూరవిద్యలో ఎంఏ ఎకనమిక్స్ చదువుకున్నారు. వివిధ పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 10 తరగతి అంధ విద్యార్థులకు తన సంస్థలో బ్రెయిలీ లిపితో విద్యాబోధన సాగిస్తున్నారు. ఆ సంస్థలో దాతల సహకారంతో అంధ విద్యార్థులకు భోజన, వసతి కల్పిస్తున్నారు. 2017 జనవరి 4న ప్రభుత్వం తరఫున రాష్ట్ర ఉత్తమ సేవా అవార్డు పొందారు.

అమ్మానాన్న లేకున్నా...


వెదురుమూడిలో బ్రెయిలీ లిపితో పాఠం చెబుతున్న వేల్పూరి వీరబాబు

రాయవరం మండలం వెదురుపాకకు చెందిన అంధుడైన వేల్పూరి వీరబాబు 2012 డీఎస్సీలో ప్రతిభ కనబరిచి వెదురుమూడి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. వీరబాబు తల్లిదండ్రులు తన 15 ఏళ్ల వయసులోనే చనిపోయారు. తల్లిదండ్రులు దూరమవ్వడం, కంటిచూపు లేకపోవడం ఆయన్ని తీవ్రంగా బాధించాయి. సొంత ప్రేరణతో 2006లో ప్రైవేట్‌గా పదో తరగతి పాసై, 2008 వరకూ మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో హెచ్ఈసీ చదివి ప్రతిభా అవార్డు సైతం సాధించారు. 2008 నుంచి 2010 వరకూ బొమ్మూరు డైట్ కళాశాలలో టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసి 2012లో ఉపాధ్యాయ వృత్తిని పొందారు.

సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి రావాలి


మాచవరంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మాచవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడం చారిత్రక అవసరంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మాచవరంలో సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ పడాల వసంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నిర్విఘ్నంగా కొనసాగాలంటే సీఎం జగన్ మరోసారి సీఎం కావాలన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పాలన పేద, మధ్య తరగతి ప్రజలకు సమ్మోహనంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల ప్రజలు అనుసరిస్తున్నారన్నారు. సంక్షేమ సారథికి తిరిగి పట్టం కట్టాల్సిన అవసరం సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని పాలన సాగిస్తుందన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి పాలనలో కొత్త అధ్యాయానికి తెరతీశారన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు, ఇంటి వద్దకే పాలన అందించడం దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. గ్రామంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ఆయన ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లిడి రామారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, మండల బూత్ కమిటీ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, కత్తుల అప్పారావు, తాడి నారాయణరెడ్డి, చింతా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం


ఈవీఎం ఉపయోగించే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించనున్న ఈవీఎంలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కోరుమిల్లి కార్యదర్శి కామేశ్వరరావు అన్నారు. కోరుమిల్లి తదితర గ్రామాల సచివాలయాల్లో ఈవీఎం యంత్రాలు పని చేసే విధానంపై బుధవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. యంత్రం పనిచేసే తీరు, ఓటరు ఓటు వేసే విధానాలపై ప్రయోగాత్మకంగా వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది అవగాహన కలిగించారు. ఓటింగ్‌లో పారదర్శకత కోసం ఈవీఎం యంత్రాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ సలాది అప్పారావు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట తప్పని నాయకుడు సీఎం జగన్

- ఎమ్మెల్సీ త్రిమూర్తులు
- పెరిగిన పింఛన్ల పంపిణీ


మాచవరంలో ఇంటింటికి వెళ్లి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పని నాయకుడని, ఇచ్చిన మాట ప్రకారం దశల వారీగా రూ.3వేల పింఛన్‌ను పెంపుదల చేసినట్లు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ప్రభుత్వం పింఛను పెంచిన సందర్భంగా మాచవరంలో బుధవారం ఆయన పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ కుల, మత, వర్గాలకు అతీతంగా పూర్తి పారదర్శకంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్లను ఇంటింటికీ పంపిణీ చేస్తూ పెన్షనర్ల కష్టాలను తొలగించారన్నారు. పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి మద్దతు పలకడానికి ప్రతీ ఒక్కరూ సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ గ్రామం ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైస్ ఎంపీపీ కొవ్వూరి అమ్మిరెడ్డి, ఎంపీటీసీ పలివెల శోభన, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. గురువారం కురకాళ్లపల్లి, కూర్మాపురం, వెంటూరు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ చేయనున్నారు. ఈ నెల 5న ఉదయం పసలపూడి, లొల్ల, సోమేశ్వరం, చెల్లూరు, 7న రాయవరం, వి.సావరం, వెదురుపాక, నదురుబాద గ్రామాల్లో పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి తెలిపారు.

శెట్టిబలిజ కల్యాణ మండపానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బోస్, కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: వేగాయమ్మపేటలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న శెట్టిబలిజ సామాజికవర్గ భవనానికి బుధవారం ఎంపీ బోస్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌ల చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబటి తుకారం, మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు దొంగల శ్రీధర్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గెద్దాడ సుబ్రహ్మణ్యం, గ్రామ పెద్దలు టేకుమూడి త్రిమూర్తులు, పితాని సూరిబాబు, కుడుపూడి బాబూరావు, కడియాల గోవిందు, మాజీ జెడ్పీటీసీ తదితరులు పాల్గొన్నారు.

రేవు శ్రీనుకు పరామర్శ


శ్రీనుని పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

కె.గంగవరం: కోటిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను) తల్లి వృద్ధాప్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన్ని మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రామచంద్రపురం టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు రాయపురెడ్డి సూరిబాబు(రాజా), జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, రామచంద్రపురం జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు రవ్వా భూషణం, పెమ్మాడి సత్తిబాబు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి

పి.గన్నవరం: అర్హతగల యువతీ, యువకులు కొత్త ఓటరుగా నమోదు కావడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పి.గన్నవరం తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ సూచించారు. ఓటరు జాబితాలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం తన కార్యాలయంలో ఠాగూర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో వివిధ క్లెయిమ్‌ల పరిష్కార తుది గడువును ఈనెల 12 వరకూ పొడిగించినట్టు వివరించారు. గత అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9 వరకూ.. కొత్త ఓట్ల కోసం వచ్చిన 5532 దరఖాస్తులను పరిశీలించి 421 దరఖాస్తులను తిరస్కరించి, 5110 దరఖాస్తులను ఆమోదించామని తెలిపారు. అలాగే ఓట్ల తొలగింపుల కోసం 4290 దరఖాస్తులు రాగా, వాటిలో 181 తిరస్కరించామన్నారు. 4088 ఓట్లను తొలగించామన్నారు. ఓట్ల బదిలీ కోసం 2352 దరఖాస్తులు రాగా వాటిలో 72 తిరస్కరించి, 2182 అంగీకరించినట్టు తెలిపారు. వివిధ పార్టీల నాయకులు చెరుకూరి గోపాలకృష్ణ, తోలేటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయిఫూలే సేవలు ఆదర్శవంతం


రామచంద్రపురంలో సావిత్రీబాయి ఫూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఏజీపీ పిల్లి మురళి, నాయకులు

రామచంద్రపురం: పట్టణంలోని రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏజీపీ పిల్లి మురళీమోహన్‌వెంకటరమణ కార్యాలయంలో బుధవారం సావిత్రీబాయి ఫూలే జయంతిని నిర్వహించారు. ఏజీపీ మురళి మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, స్త్రీ విద్యకు తొలి అడుగు వేసిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో కట్టా సూర్యనారాయణ, యాండ్ర బుల్లబ్బులు, టేకుమూడి సత్యనారాయణ, ఎంవీ సుబ్బారావు, కాజా జగన్నాథం, ముంగండ భాస్కరరరావు, మురమళ్ల వెంకటరావు, పిల్లి గణపతి, పంపన దుర్గాపవన్‌కుమార్, మాలయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో..

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో మైనార్టీ బీసీ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి ఫూలే, జ్యోతిరావ్ ఫూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ బీసీ సంఘం నాయకులు యాట్ల నాగేశ్వరరావు, బంధనపూడి రామకృష్ణ, కొసనా భీమశంకరం, యాట్ల అప్పారావు, పడిదడకల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు మండలంలో..

కాజులూరు: సావిత్రీబాయిఫూలే ఆశయాలను నేటి తరం మహిళలు ఆదర్శగా తీసుకోవాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. గొల్లపాలెంలో బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ నేత, విశ్రాంత ఉపాధ్యాయుడు మేడిశెట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన సావిత్రిబాయిఫూలే జయంతి కార్యక్రమాల్లో బుల్లిరాజు పాల్గొని ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు బయటకు రావాలంటే ఎన్నో ఆంక్షలు ఉండే ఆ రోజుల్లో సావిత్రిబాయిఫూలే మహిళా పాఠశాలలను స్థాపించి ఎందరో బాలికలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారన్నారు. దుగ్గుదుర్రులో బీసీ నేత కడలి రాంపండు ఆధ్వర్యంలోనూ, కుయ్యేరులో గ్రామ సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలోనూ కాజులూరులో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ ఆధ్వర్యంలోనూ నాయకులు సావిత్రిబాయిఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సామాజిక ప్రగతికి చోదకశక్తి సావిత్రిబాయి ఫూలే

కపిలేశ్వరపురం: అజ్ఞానం, అంధకారం రాజ్యమేలుతున్న రోజుల్లో సామాజిక ప్రగతికి చోదకశక్తిగా సావిత్రిబాయిఫూలే నిలిచారని ఆమె జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండపేట మండలం సంగమేశ్వరం కాలనీ ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన జయంతి కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం ముత్యాల మాణిక్యాంబ అధ్యక్షత వహించారు. హెచ్‌ఎం మాణిక్యాంబ, ఉపాధ్యాయుడు సీహెచ్. వెంకట శ్రీధర్ మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా దేశ ప్రగతికి పాటుపడ్డారన్నారు. ఉపాధ్యాయినులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సత్కరించారు.


సంగమేశ్వరం పాఠశాలలో ఉపాధ్యాయినులను సత్కరించిన సహ ఉపాధ్యాయులు


సావిత్రీబాయిఫూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బుల్లిరాజు